మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## 22.3 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్ నీటిమట్టం..

### -కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి వచ్చి చేరుతున్న నీరు

**దేవరకద్ర,జూలై 27 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్‌హౌజ్ నుండి ప్రాజెక్టుకు కృష్ణజలాల తరలింపు ఇటీవల నిలిపివేశారు.వర్షాలు పడుతుండటంతో వాటిని నిలిపివేశారు.వర్షాలు కురుస్తుండటంతో కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడం ప్రారంభమైంది.దీంతో గురువారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 22.3 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 10.2 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.


నీటితో కళకళలాడుతున్న కోయిల్‌సాగర్

## జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కే.సీతారామరావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**అదనపు కలెక్టర్‌గా రెవెన్యూగా ఇంతకు ముందు విధులు నిర్వర్తించిన మోతిలాల్ బదిలీపై మంచిర్యాల జిల్లాకు బదిలీ కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఖాళీగా ఏర్పడగా మహబూబ్‌నగర్ జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బాధ్యతలు నిర్వహిస్తున్న కే. సీతారామరావు బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను కలిసి మొక్కను అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రెవెన్యూ బాధ్యతలను తన చాంబర్‌లో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వహించినందున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై అవగాహన ఉందని, తన శక్తి మేరకు జిల్లా అభివృద్ధికి పాటు పడుతానని తెలిపారు.


అదనపు కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న పి.ఉదయ్‌కుమార్

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి:జిల్లా ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,జూలై 27 ప్రభాతవార్త :** జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లా పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువును, ఉట్కూర్ పరిధిలోని పగిడిమర్రి, అమీన్‌పూర్ మధ్యలో గల రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. జిల్లా పరిధిలోని పోలీస్ యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని గ్రామాలలో చెరువులు, వాగులను పరిశీలించాలని అత్యవసర సమయంలో ప్రజల రక్షణ కోసం రెవెన్యూ అధికారుల సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670399 డయల్ 100కి ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం పొందాలని తెలిపారు. ప్రజలు ఎవరు చెరువుల వద్దకు వాగుదల దగ్గరకు నదుల దగ్గరికి వెళ్లకుండా పోలీస్ అధికారుల సూచనలను పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వర్షాలకు కల్వర్టు, చిన్నచిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. ఎస్పీతో పాటు ఎస్‌బి సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణయ్య, ఎస్సై సురేష్ ఉన్నారు.


బ్రిడ్జిపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

## కులవృత్తులు లేకుంటే నాగరికతే లేదు..

**వెనుకబడిన తరగతులలోని అన్ని కులాల వారిని ఆదుకుంటాం**

**బిసిలకు ఇచ్చే రూ. 1 లక్ష ఉచిత ఆర్థిక సహాయ పథకం నిరంతరం కొనసాగుతుంది**

**ఉచిత విద్యుత్‌కు కేంద్రం ఆటంకాలు సృష్టించినా కెసిఆర్ ఆపలేదు: డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూలై 27 ప్రభాతవార్త :** పూర్వం నుంచి వ్యవసాయం, అనుబంధ కులవృత్తుల ద్వారానే గ్రామాలు ఏర్పడ్డాయని, కులవృత్తులు లేకుంటే నాగరికతయే లేదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మహబూ బ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో జిల్లా బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని వెనుకబడిన తరగ తులలోని పేదలకు ఇచ్చే రూ. లక్ష ఆర్థిక సహాయం చెక్కులను ఆయ న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దండగ చేయ డం వల్లే రైతులు, రైతు కూలీలు, వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత చెరువులను పునరుద్ధరించడం, ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టి రైతులకు రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలను తీసుకువచ్చిందని అన్నారు. వెనుకబడిన కులాల ఆర్థిక సహాయం పథకం నిరంతరం కొనసాగుతుందని, రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలియజేశారు. ప్రతినెల 300ల మంది లబ్ధిదారులకు ఆయా నియోజకవర్గాలలో ఆర్థిక సహాయం విడతల వారిగా అందరికి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి సంక్షేమ పథకాలను అందించడంలో నిస్పక్షపాతంగా ఉంటామని, ఎవరైనా పేదల నుండి లబ్ధికోసం డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే తక్షణమే వారిపై పోలీస్ కేసు నమోదు చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని, శిల్పారామంలో ఉన్న స్థలంలో ఒకప్పుడు 30 ఫీట్ల గుంతలు ఉండేవని, అలాంటిది శిల్పారామాన్ని నిర్మించి ఈ ప్రాంతానికి అందాన్ని తీసుకువచ్చామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కారణంగా భూముల ధరలు పెరిగిపోయాయని, మహబూబ్‌నగర్ జడ్చర్ల నాలుగు లైన్ల రహదారి, బైపాస్ రహదారితో పాటు, అన్ని మతాలకు సంబంధించిన ప్రార్థన మందిరాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గత సంవత్సరం వర్షపు నీటికి రామయ్యబౌలి ప్రాంతం నీటిలో మునిగిపోయిందని, అలాంటిది నాళాలు విస్తరించడం, ఈ సంవత్సరం మురికి కాలువలు శుభ్రం చేయడం కారణంగా వర్షం నీరు మిని ట్యాంక్ బండ్‌లోకి వెళ్తోందన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మరో రూ. 100 కోట్లను తీసుకు వచ్చామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఇటీవలే రూ. 276 కోట్లు విడుదల కాగా ఎస్టీపి, మెయిన్ ట్రంక్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పోరేషన్‌గా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వస్తే జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. పెద్ద చెరువును కృష్ణానది నీటిని నింపుతామని తెలిపారు.


లక్ష ఆర్థిక సహాయం అందుకున్న లబ్దిదారులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**జిల్లా వ్యాప్తంగా 15,787 దరఖాస్తులు ...**

కాగా బిసిలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం జిల్లా వ్యాప్తంగా 15,787 దరఖాస్తులు రాగా, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ సుమారు 14 వేల దరఖాస్తులను అర్హమైనవిగా గుర్తించింది. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 4779 దరఖాస్తులు రాగా అందులో 4221 దరఖాస్తులు అర్హత ఉన్నవిగా గుర్తించగా, ఈనెలకు సంబంధించి 300ల మంది లబ్దిదారులకు మొదటి విడతగా ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని మంత్రి చేతుల మీదుగా పంపిణీచేశారు. శిల్పారామంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఒకేసారి 300ల మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారితో సెల్ఫీ దిగారు.

## ముసురు వర్షాలతో అవస్థలు..!

### కూలిన మట్టి ఇండ్లు, జలకళతో వాగులు, చెక్‌డ్యాంలు

**చిన్నచింతకుంట,జూలై 27 ప్రభాతవార్త :** వారం రోజులకు పైగా కురుస్తున్న ముసురు వర్షాలతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం వర్షాలు కురుస్తుండడంతో ఇండ్ల నుంచి బయటికి రాలేక వ్యవసాయ పనులు చేసుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ముసురు వర్షాల వల్ల రహదారులు బురదమయంగా మారి పారిశుద్ధ్య లోపం కారణంగా రోగాల బారిన పడే ప్రమాదముందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో మట్టి ఇండ్లలో నివసించే కుటుంబాలు ముసురు వర్షాల కారణంగా తమ మట్టి ఇండ్లు ఎప్పుడు పడిపోతాయోనని బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా గ్రామాల్లో మట్టి ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. ఉంద్యాల, పర్దీపూర్ గ్రామాల్లో మట్టిఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన వారిని ప్రభుత్వ పాఠశాలలో ఉంచారు. ముసురు వర్షాలతో వాగులు, వంకలు వరదనీటితో పొంగిపొర్లుతున్నాయి. సీతారాంపేట సమీపంలోని లో లెవల్ బ్రిడ్జి తాకుతూ మన్నెవాగు ప్రవహిస్తుంది. వడ్డెమాన్ సమీపంలోని ఊకచెట్టు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం వరద నీటితో అలుగుపారుతూ పర్యాటకులను ఆకర్షిస్తుంది. ముసురు వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రెండు,మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలందరు తగు జాగ్రత్తలు తీసుకుని అవసరం ఉంటేనే బయటికి రావాలని అధికారులు కోరుతున్నారు.


కూలిన మట్టిఇల్లు


కళకళలాడుతున్న చెక్‌డ్యాంలు

## మహబూబ్‌నగర్ డ్రోన్ షో వాయిదా..!

### రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూలై 27 ప్రభాతవార్త :** నిరంతరాయంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈనెల 28న మహబూబ్‌నగర్ పట్టణంలోని ట్యాంక్ బండ్‌పై నిర్వహించదలచిన డ్రోన్ ప్రదర్శనను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన శిల్పారామంలో నిర్వహించిన బిసి రుణాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడం, రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడం, వర్షం కారణంగా ప్రజలు డ్రోన్ ప్రదర్శను తిలకించేందుకు వచ్చే అవకాశం లేనందున డ్రోన్ ప్రదర్శనను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను తిరిగి ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని మంత్రి వెల్లడించారు. తెలంగాణ సెక్రెటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా అత్యద్భుతంగా డ్రోన్ షో నిర్వహించిన ఆస్ట్రేలియాకు చెందిన ఆయుష్ బృందాన్ని మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. తమ క్యాంపు కార్యాలయంలో ఆయుష్ బృందం మంత్రికి డ్రోన్ ప్రదర్శనపై వివరించారు. తదితర అభివృద్ధి చెందిన దేశ ఆస్ట్రేలియాకు చెందిన ఆయుష్ టీమ్ ఆధ్వర్యంలో 450 డ్రోన్లతో ఈ ప్రదర్శన శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఉప్పొంగుతున్న బాలానగర్ దుందుభి వాగు..

**ఎడతెరిపి లేని వర్షాలతో నిండుతున్న వాగులు, వంకలు**

**తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని అధికారుల సూచన**

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు**

**బాలానగర్,జూలై 27 ప్రభాతవార్త:**గతకొన్ని రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్నవర్షాలకు బాలానగర్ మండలంలోని దుందుబి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. గత నెలలో ప్రారంభం కావాల్సిన వర్షాలు ఆలస్యంగా ఆరంభమైనా ఊహించని విధంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.పలు గ్రామాలలోని పంట పొలాలలో వర్షపు నీరు నిండుగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో పలు గ్రామాలలో కుంటలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి.




ఉప్పొంగి ప్రవహిస్తున్న దుందుబి వాగు

## కారు,లారీ ఢీ ఇద్దరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం..!

**నారాయణపేట ప్రతినిధి,జూలై 27 ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై రోజు రోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గురువారం గుడిబండ్ల గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున 6 గం.ల ప్రాంతంలో లారిని మారుతి ఎర్టిగా కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో భాషా (48) శంకర్ (50) అప్పనపల్లి గ్రామవాసి అక్కడికక్కడే చనిపోగా వెంకట్రావ్ (45) తీవ్రంగా గాయపడగా చికిత్సకై మహబూబ్‌నగర్ జిల్లాకు పంపడం జరిగింది. సీటు బెల్టు పెట్టుకోవడంతో ప్రశాంత్ (25) డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గోవా నుండి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గుడిగండ్ల గ్రామం రైల్వే బ్రిడ్జి దగ్గర ఉన్న సబ్ స్టేషన్ దగ్గర హైదరాబ్‌కు వెళ్తున్న లారీని ఓవర్టేక్ చేద్దామని పోయి లారీని ఢీకొనడం జరిగింది. వెనకవైపు బంపర్‌కు ఇరుక్కున్న మారుతి ఎర్టిగా కారు దాదాపు అర కిలోమీటర్ వరకు ఈడ్చుకుపోవడం జరిగింది. కొందరి విషయాన్ని డ్రైవర్‌కు తెలపగా భయపడి లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఈ విషయాన్ని మొత్తం పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని చనిపోయిన ఇద్దరిని మొక్కలు ఆసుపత్రికి తరలించి తీవ్రంగా గాయపడిన వెంకటరావును జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరీ ముఖ్యంగా అక్కడక్కడ రహదారిపై సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు తరచుగా గుడిగండ్ల ప్రాంతంలో జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇకనైనా రహదారిపై అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


లారీని ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారు

## వర్షాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

- **వాగులు, వంకల వద్ద ప్రజలు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...**
- **జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి:కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా రాబోవు రెండు రోజులు ఓ మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నివేధిక ఇచ్చినందున ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున గురువారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందించారు. జిల్లాలో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు అవసరమైన సిబ్బంది ఏ శాఖ నుంచి అయిన తీసుకోవచ్చని ఆదేశించారు.వారం రోజుల నుంచి వర్షాలకు తడిచి కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇండ్లను, పశువుల కొట్టాలని గుర్తించాలని, గుర్తించిన ఇళ్ల నుంచి ప్రజలను సురక్షిత శిబిరాలకు తరలించాలని సూచించారు. అదే విధంగా కాజ్‌వేల నుంచి ఎక్కడెక్కడ నీరు పారుతుందనే వివరాలు సేకరించి ప్రయాణీకులను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన చోట భారికేడ్లను ఏర్పాటు చేసి అక్క డికి ఎవ్వరు వెళ్లకుండా మనుషులను పెట్టాలని సూచించారు. అకస్మాత్తుగా భారీ వర్షం పడి కాజ్‌వే పొంగే ప్రమాదం ఉంటుంది కాబట్టి అలాం టి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. చెరువులు నిండి అలుగు పారుతున్న వాటిని గుర్తించాలని, ఎక్కడైన చెరువు కట్టలు ప్రమాదకరంగా ఉంటే వాటిని ముందే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి కొరకు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పంచాయతీ సెక్రటరీల సహకారం, జెడ్పీ సీఈఓ ద్వారా ఎంపీడీఓలు వారి సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలియజేశారు. జూరాల నుంచి నీటి విడుదల ప్రారంభమైందని, నది పరివాహక ప్రాంతాల గ్రామాలను గుర్తించి గ్రామస్తులు నదిలోకి వెళ్లకుండా, పశువుల కాపర్లు పశువులను విడవకుండా, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఎలాంటి విపత్తు సంభవించిన ఎదుర్కొనే విధంగా సర్వం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు తడిచి ఇప్పటి వరకు జిల్లాలో 30 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం ఓటర్ నమోదు ధరఖాస్తులపై సమీక్షా నిర్వహించారు. అన్ని రకాల ఓటర్ల ధరఖాస్తులను గురువారం సాయంత్రం లోగా పరిష్కరించాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేధిక ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఎస్.ఎస్ఆర్ నేటితో గడువు ముగుస్తుందని, దీని తర్వాత జిల్లాలో 18-19 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న యువతను గుర్తించి ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసే విధంగా బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఒక ఇంటి నెంబరు నుంచి 6 అంతకన్న ఎక్కువ ఓటర్ల పేర్లు తొలగించాల్సి వచ్చినప్పుడు తహసీల్దార్ స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో గుర్తించి ఖాళీ స్థలాల్లో లే అవుట్‌లు చేయించి లబ్దిదారులను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

అవసరమైన చోట లక్కీ డీప్ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కుమార్ దీప్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు జాకీర్ హుస్సేన్, రవికిరణ్, డి.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో సమస్యకు శాశ్వత పరిష్కారం..

**దశల వారిగా పట్టణంలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నాం**

**వార్డు పర్యటనల సందర్భంగా మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 27 ప్రభాతవార్త :** తెలంగాణ ఏర్పాటుకు ముందే జిల్లా కేంద్రంలో వెలసిన అక్రమ లే అవుట్ల వల్ల డ్రైనేజీ సమస్య ఏర్పడి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని గతంలో జరిగిన అనర్థాలను దశల వారిగా తాము సరిచేస్తూ పోతున్నామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గతంలో సమస్యలన్నింటిని గాలికి వదిలేయడం వల్ల ప్రస్తుతం ఆ భారమంతా తమపై పడుతోందని అయినప్పటికి మహబూబ్‌నగర్‌ను నంబర్ వన్ చేయడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సార్‌నగర్, కాలనీ విఘ్నేశ్వర్ కాలనీ, శ్రీరామ్‌కాలనీ, అయోధ్యనగర్‌లలో మంత్రి జోరు వానలోనూ వార్డు పర్యటన చేపట్టారు. రూ 4.73 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇంటింటికి వెళ్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టేటప్పుడు అన్ని రకాల అనుమతులతో పాటు నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వార్డుల్లో సమస్యల పట్ల అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతేడాది వర్షాకాలం ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చిందని ఈ ఏడాది విస్తృతంగా డ్రైనేజీ సిస్టం ఏర్పాటుచేసి ఆసమస్య లేకుండా చేశామన్నారు.శ్రీరామకాలనీ స మీపలోని బైపాస్‌రోడ్డు రావడంవల్ల ఊహించని డిమాండ్ ఏర్పడిందని మంత్రి తెలిపారు.గతంలో జీపీ లే అవుట్లు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాల కల్పన లేకుండానే ప్లాట్లు చేసి విక్రయించారని వారు చేయాల్సిన అభివృద్ధి పనులన్నింటిని తామే చేయాల్సి వస్తున్నదన్నారు. అయోధ్యనగర్ హనుమాన్ టెంపుల్ ఆవరణలో స్థానికుల విజ్ఞప్తి మేరకు హనుమాన్ టెంపుల్ ఆవరణలో రూ.50లక్షల అంచనా వ్యయంతో పార్కు నిర్మాణం చేపడతామని తెలియజేశారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకోసం ఇప్పటికే నిధులు విడుదల అయ్యాయని తద్వారా వందేళ్ల వరకు డ్రైనేజీ సమస్య లేకుండా పూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. విఘ్నేశ్వర కాలనీలో వార్డులో పర్యటించారు. నూతన ఇండ్ల నిర్మాణంతో వర్షపు నీళ్లన్ని ఓపెన్ ప్లాట్లలోకి వెళ్లి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని వెంటనే డ్రైనేజీ పనులను, ఆ తర్వాత రోడ్డు పనులను చేపట్టాలని, స్థానికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, స్థానిక కౌన్సిలర్ రాణిరాజు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


అయోధ్య నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాన్ని వీక్షించిన రైతులు

**మక్తల్,జూలై 27 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ 1.25 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను దేశంలోని రైతులకు గురువారం ఉదయ 11గం.లకు అంకితం చేయడం జరిగింది. స్థానిక మక్తల్ పట్టణంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ సెంటర్‌లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యక్ష ప్రసంగాన్ని వీక్షించారు. గ్రో మోర్ ఫర్టిలైజర్ సెంటర్‌లో పాల్గొన్న రైతుల ప్రసంగం కార్యక్రమంలో మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, జిల్లా బిజెపి నాయకులు బలరాంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ, కిసాన్ సమృద్ధి కేంద్రాలలో రైతులకు తక్కువ ధరలకు విత్తనాలను, పురుగుల మందులు అందించడమే కాకుండా రైతులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ధరలకు ఇచ్చి ఎరువులను, పంటకు సంబంధించిన భూసార పరీక్షలకు, వివిధ రైతు సంక్షేమ పథకాలు ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో వారికి అన్ని సేవలు ఒకే దగ్గర రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు తీసుకొచ్చి జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి రైతుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మండల బిజెపి పార్టీ నాయకులు అన్నారు.



## మరికల్ సిఐగా ఎన్.రాజేందర్..

**మరికల్,జూలై 27 ప్రభాతవార్త :** మరికల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎన్. రాజేందర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు సైబరాబాద్, కూకట్‌పల్లిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ సిఐగా ప్రమోషన్ పొంది ఐజి కార్యాలయం వెయిటింగ్ నుండి బదిలీపై సిఐగా ఇన్స్‌పెక్టర్ రావడం జరిగింది. ఇంతకు ముందు సిఐగా పదవి బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లుకు పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి సిఐ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు లేకుండా శాంతిభద్రతలు పరిరక్షించాలని సూచించారు. అనంతరం మరికల్ సిఐ రాజేందర్ మాట్లాడుతూ 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## డ్రైవింగ్ లైసెన్స్ కోసం రోజు రోజుకు పెరుగుతున్న ధరఖాస్తులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంజెఆర్ ట్రస్ట్‌ద్వారా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి రోజు రోజుకు అపూర్వ స్పందన లభిస్తోంది. గురువారం చాలా సుదూర ప్రాంతాల నుంచి వర్షం లెక్క చేయకుండా వస్తున్న యువతీ, యువకులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు 1500 మంది యువతీ యువకులు హాజరై తమ ధరఖాస్తులను అందించడంతో పాటు భోజన వసతి కల్పించడంతో యువతీ యువకులు భోజనం చేసి వెళ్లారు. ఆగస్టు 2 చివరి తేదీ కావడంతో రోజు రోజుకు దరఖాస్తులు పెరుగుతున్నాయన్నారు. 2వ తేదీ వరకు ఎంత మంది వచ్చిన వారందరికి దరఖాస్తు ఫారాలను అందిస్తామన్నారు.



## గౌడ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో గౌడ సంఘం మండల కమిటీ అధ్యక్షులు మట్ట వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో గురువారం గౌడ సోదరులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ గౌడ సంఘం మండల అధ్యక్షులుగా మట్ట ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షులుగా పాల శ్రీనుగౌడ్, యూత్ అధ్యక్షులుగా మట్ట శివగౌడ్, ఉపాధ్యక్షులు మట్ట నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మట్ట శ్రీశైలంగౌడ్, కోశాధికారి మట్టరవిగౌడ్, ప్రచారకార్యదర్శి మట్ట వెంకటయ్యగౌడ్‌లతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గౌడసంఘం మండలఅధ్యక్షులు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## కల్వకుర్తి మున్సిపల్ గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా వాగుల్‌దాస్ నరేష్‌గౌడ్ ఎన్నిక

**కల్వకుర్తి, జూలై 27 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపల్‌గౌడ యువజన సంఘం నూతన అధ్యక్షులుగా వాగుల్‌దాస్ నరేష్‌గౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కల్వకుర్తి పట్టణంలో మున్సిపల్ గౌడ యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ పార్టీలో చురుకైన నాయకుడిగా సేవలందిస్తున్న నరేష్‌గౌడ్ కల్వకుర్తి మున్సిపల గౌడ యువజన సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనందుకు ఆయన ఆధ్వర్యంలో గౌడసంఘంలో ఉన్న యువకులు, సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు దుర్గప్రసాద్, బొడనరసింహ, బృంగి వివేకానంద, రవిగౌడ్, విజయ్, బాబీదేవ్, శ్రీధర్, మహేష్, కిశోర్, లక్ష్మినరసింహ తదితరులు ఉన్నారు.



## వర్షాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో 24 గంటల హెల్ప్ లైన్ కంట్రోల్ రూం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి రానున్న రెండు రోజులు జిల్లాలో సైతం మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వర్షాల వల్ల ఎదైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే హెల్ప్‌లైన్ కంట్రోల్ రూం నెం.9866756825 కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. అదే విధంగా నది పరివాహక ప్రాంతం ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపలు చేపట్టేందుకు జాలర్లు వెళ్లవద్దని హెచ్చరించారు. జూరాల నుంచి నీటి విడుదల ప్రారంభం అయినందున కృష్ణ నది కాలువల గుండా పశువుల కాపర్లు పశువులను తీసు కొని వెళ్లవద్దని సూచించారు. ప్రవహిస్తున్న కాజ్‌వేల గుండా ప్రయాణం చేయవద్దని, పాత మిద్దెలు కూలడానికి సిద్దంగా ఉన్న మట్టి గోడలు, ఇళ్లలో నివసించకుండా ఖాళీ చేసి సురక్షిత శిబిరాలకు తరలివెళ్లాలని తెలియజేశారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం..

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన అనీస్ అనారోగ్యంతో బాధపడుతూ కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మొక్తాల శేఖర్ ముదిరాజ్ అనీస్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. బాధితుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.



# పాలమూరుజిల్లాలో వీడని ముసురు వర్షం..!

- ఇబ్బందుల పాలవుతున్న ప్రజలు
- వ్యవసాయపనులకు అడ్డంకి
- జిల్లాలో అత్యధికంగా దేవరకద్రలో 58.0,అతితక్కువగా మహబూబాబాద్‌లో 6.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



దేవరకద్ర పెద్దచెరువులోకి వచ్చి చేరిన వర్షపు నీరు

**దేవరకద్ర,జూలై 27 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లాను ముసురు వర్షం వీడటంలేదు. బంగాళఖాతంలో ఏర్పాడిన అల్పపీడనం కారణంగా ముసురువర్షాలు జిల్లాను పట్టిపీడిస్తున్నాయి.దీంతో జనజీవనం అతలాకులం అవుతంది.వారం రోజుల నుండే మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రోజురోజుకు ముసురువానలు పెరుగుతున్నాయి తప్ప తగ్గండ లేదు.దీంతో నీరులేక వెళవెళ బోయిన చెరువులు,కుంటలు,చెక్‌డ్యాంలు క్రమేపి జలకళ సంతరించుకొంటున్నాయి. కురుస్తున్న వర్షాల కారణంగా వాటిలోకి కాస్త నీరు వచ్చి చేరుతుంది. చెక్‌డ్యాంలలోకి కూడ నీరు వచ్చి చేరుతుంది. దీంతో వాటికి జలకళ ఉట్టి పడుతుంది.జిల్లాలో బుధవారం రాత్రి దేవరకద్రలో 58.0,అతితక్కువగా మహబూబాబాద్‌లో 6.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అలాగే అడ్డాకులలో 56.6,మూసాపేటలో 53.1కౌకుంట్లలో 45.9,చిన్నచింతకుంటలో 46.1, కోయిలకొండలో 32.4,గండీడ్‌లో 36.1,హన్వాడలో 38.4, మహబూబ్‌నగర్ రూరల్‌లో 49.8,భూత్‌పూర్‌లో 39.7,నవాబ్‌పేటలో 36.2,బాలానగర్‌లో 35.7,రాజాపూర్‌లో 34.8,జడ్చర్లలో 36.6, మిడ్జిల్‌లో 32.2,మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి తప్పించి అన్ని మండలాల్లో మోతాదుకు అధిక వర్షపాతం నమోదైంది.వర్షాల కారణంగా వేసిన పంటలు దెబ్బతినకుండా తగు జాగ్రత్తలను ఆయా మండలాల్లో వ్యవసాయాధికారులు రైతాంగానికి సూచనలు ఇస్తున్నారు.

**ముసురుతో జిల్లాలో ప్రజల ఇబ్బంది..**

వీడని ముసురు వర్షంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. బయటికి వెళ్ళాలంటే వర్షం కారణంగా జంకుతున్నారు. వర్షాలకు తోడు వాతావరణం చల్లబడటంతో వృధ్దులు,చిన్నపిల్లలు,దీర్ఘకాలిక రోగులు పడే అవస్థలు అన్నిఇన్నికావు. వర్షం కారణంగా వ్యవసాయ సేధ్యం పనులకు బ్రేక్ పడింది. వ్యాపారస్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. మట్టి ఇళ్లలో నివసించే వారు వాటిలో ఉండటానికి భయపడుతున్నారు. రహదారులు చిత్తడిగా మారాయి.ముసురు వర్షాల కారణంగా జిల్లాలోని గొర్లు,మేకలు,పశులలో ఎక్కడ రోగాలు వస్తాయోనని వాటి కాపరులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల కారణంగా ఇప్పటికే అవి మేత మేయలేక పోతున్నాయని వాటి కాపరులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.ముసురు వర్షాల కారణంగా జిల్లాలో వరుసగా పాఠశాలలకు సెలవులు ఉంటుండటంతో విధ్యార్థుల చదువులకు కూడ వర్షం అడ్డంకిగా మారింది.అలాగే ఆయా గ్రామాలలో ఉన్న మట్టిరోడ్లు సైతం దెబ్బతింటున్నాయి.

## వట్టెం నవోదయలో ప్రారంభమైన క్రీడా సమ్మేళనం...



క్రీడా పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం



క్రీడలాడుతున్న విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నవోదయ విద్యాలయాల క్రీడల సమ్మేళనం గురువారం వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బిజినపల్లి మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ శ్రీ ప్రసాద్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, వారి ప్రతినిధుల సమక్షంలో అతిథులు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ జిల్లాల క్రీడా ప్రతినిధులు వారి వారి నవోదయ విద్యాలయాల జెండాలను ఒక్కటిగా చేర్చి క్రీడా ప్రతిజ్ఞన చేశారు. అనంతరం జరిగినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నవోదయలో విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో హర్షనీయమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడా స్ఫూర్తిని సమ సమాజానికి చాటాలని క్రీడల్లో ప్రతిభ చూపించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడా స్ఫూర్తితో వృద్ధి చెందితే భవిష్యత్తులో వారి లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చునన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. విద్యాలయ క్రీడ సమ్మేళన విశేషాలను ఇక్కడ నిర్వహించే కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, యోగా లాంటి అంశాల్లో ఎంపికైనటువంటి ఉత్తమ క్రీడాకారులను రీజినల్ స్థాయికి పంపుతామన్నారు. ఎస్కార్ట్ సిబ్బంది సమక్షంలో ఆటల పోటీలు ప్రారంభించడం జరిగిందన్నారు. క్రీడా జ్యోతి వెలిగించాక అధికారిక సమ్మేళనాన్ని ప్రారంభించారు. వివిధ భాగాల్లో వివిధ స్థాయిల్లో బాలురు, బాలికలను ప్రత్యేకంగా ఎంపిక చేయడం జరిగింది. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జానకి రాములు, సిబ్బంది రాములు తదితరులు ఉన్నారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

### - మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్

**అమరచింత,జూలై27,ప్రభాతవార్త:** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మట్టి ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ ప్రజలను కోరారు. గురువారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో ఆయా వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మట్టి ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారీ వర్షం కురవడంతో మట్టి మధ్యలో నివసిస్తున్న ప్రజలు తక్షణమే ఖాళీ చేసి వారి కోసం మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో పునరావాసం ఏర్పాటు చేశామని, ఇల్లు పూర్తిగా కోల్పోయిన వారు మున్సిపల్ కార్యాలయంలో ఉండాలని ఆమె కోరారు. అలాగే వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో పిల్లలు, పెద్దలు విద్యుత్ స్థంభం దగ్గర ఉండకూడదని వర్షం వల్ల విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఎవరు కూడా విద్యుత్ స్థంభాలకు వెళ్లకుండా ఉండాలని ఆమె ప్రజలను కోరారు. పూర్తిగా వర్షానికి ఇండ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పాత మట్టి ఇండ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

## మత సామరాస్యానికి ప్రతీక మొహర్రం ..

**వనపర్తిటౌన్,జూలై27,ప్రభాతవార్త:**మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని టీడీపీ అధ్యక్షులు నందిమల్ల అశోక్ అన్నారు. మొహర్రంపండుగ సందర్భంగా జిల్లాకేంద్రంలోని పీర్లగుట్టపై ప్రతిష్ఠించిన గట్టు మీనయ్యను తెలుగుదేశం నాయకులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ అధ్యక్షులు నందిమల్ల అశోక్ మాట్లాడుతూ... పీర్లగుట్టపై వెలసిన పీర్లు, పీర్లగుట్ట మహిమాన్వితమైందని అన్నారు. వనపర్తి చరిత్రకు, సంస్కృతి సాంప్రదాయాలకు పీర్లగుట్ట పీర్లు నిదర్శనం అని ఆయన అన్నారు. మతాలకు అతీతంగా ప్రజలు సంతోషంగా మొహర్రం పండుగ జరుపుకుంటారని,ఈసంస్కృతిని భావితరాలకు యధావిధిగా అందించుటకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పీర్లగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పేరిట మట్టి దోపిడి జరిగిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల నివాసాలకు అనువైన స్థలాలను ప్రభుత్వం వేరే చోట ఇచ్చి వారి సేవలకు గుర్తింపు ఇచ్చి గౌరవించాలని ఆయన కోరారు. వనపర్తికి వాస్తు పీర్లగుట్ట కాబట్టి ఇప్పటికైనా ధ్వంసం చేసిన చోట ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీర్లను దర్శించుకున్న వారిలో నందిమల్ల అశోక్ వెంట రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి నందిమల్ల శారద, బాలరాజు, కొత్త గొల్ల శంకర్, అనిల్ ఉన్నారు.



పీర్లను దర్శించుకున్న టీడీపీ అధ్యక్షులు నందిమల్ల అశోక్

## రాష్ట్రపతిగా దేశ సేవకు అంకితమైన మహనీయుడు అబ్దుల్ కలాం

**వనపర్తిటౌన్,జూలై27,ప్రభాతవార్త:**శాస్త్రవేత్తగా దేశరక్షణకు , రాష్ట్రపతిగా దేశ సేవకు అంకితమైన మహనీయుడు అబ్దుల్ కలాం అని నందిమల్ల అశోక్ అన్నారు. గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించి పట్టుదలతో చదివి శాస్త్రవేత్తగా ఎదిగి ఈ దేశానికి రక్షణగా నిలిచి మేధావి అబ్దుల్ కలాం అని ఆయన కొనియాడారు.దేశానికి చేసిన సేవలు గుర్తించి ఆనాటి ఎన్‌డీఏ కన్వీనర్ చంద్రబాబు నాయుడు అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ప్రతిపాదించి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో రాష్ట్రపతిగా ఎంపిక చేసి వారిని గౌరవించారని ఆయన తెలిపారు. అబ్దుల్ కలాం సాధారణ జీవితం స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండి గౌస్, ఆవుల శ్రీను, బండారు గోపాల్, వహీద్, బాలరాజు, కొత్త గొల్ల శంకర్ , అనిల్ పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

### క్షిపణి మనిషి అబ్దుల్ కలాం : ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆధ్వర్యంలో అంతరిక్ష శాస్త్రవేత్త, క్షిపణిమనిషి అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ.... భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త రాజకీయవేత్త మాజీ రాష్ట్రపతి పద్మభూషణ్, పద్మ విభూషణ్ , భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం భౌతిక ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నాలుగు దశాబ్దాల పాటు శాస్త్రవేత్తగా సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఇస్రో అంతరిక్ష కార్యక్రమం సైన్స్ అభివృద్ధి ప్రయత్నాలు బాలిస్టిక్ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందాడని అన్నారు. యువతీ యువకులు విద్యార్థులు బాగా చదువుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లల్లో పిల్లవాడుగా పెద్దల్లో పెద్దమనిషిగా యువ స్వప్నం స్వాగతించిన సాహసికుడు పల్లె నుండి పైకి ఎగిరి వచ్చిన ఇప్పుడు నిత్య విద్యార్థి నిరంతరం సోదరుడు ఓటమిని గెలుపుగా తీర్చిదిద్దిన పేదల ఆరోగ్యానికి రక్షణ ఇచ్చిన శాస్త్రవేత్త అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరి రాజాచారి, కవి శ్రేష్టుడు వ్యాఖ్యత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, కవి గాయకుడు విభూది ఈశ్వర్, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, వనపర్తి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు బండలయ్య, పాలిటెక్నిక్ సిబ్బంది నవీన్, మణికుమార్, అబ్దుల్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ మండల ప్రజలకు పోలీసుల హెచ్చరిక

**మల్దకల్, జూలై 27 ప్రభాతవార్త :** రానున్న రెండురోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని మండల ప్రజలను ఎస్సై కళ్యాణ్‌రావు కోరారు. అవసరం ఉంటేనే తగు జాగ్రత్తలతో బయటికి రావాలని, పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. బయట కరెంటు స్తంభాలు పట్టుకోరాదని, రోడ్లమీద మ్యాన్ హోల్స్‌ల జాగ్రత్తగా ఉండాలని భారీ వర్షాల కారణంగా ప్రభుత్వం రెండు రోజులు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ముఖ్యంగా రైతన్నలు పొలాల దగ్గర విషసర్పాలు, విద్యుత్ స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని మండల ప్రజలు అందరూ బాగుండాలని కోరారు.



## మైనార్టీ లబ్దిదారులకు ఇంటర్వ్యూలు

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 2022-23 సంవత్సరానికి ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు మైనార్టీ లబ్దిదారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వెల్దండ,జూలై 27 ప్రభాతవార్త:**వెల్దండ మండలపరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన దుబ్బ జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. మృతుడి కుటుబసభ్యులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు గున్నెళ్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పడకంటి వెంకటేష్‌లు వేర్వురుగా పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని జీ.శ్రీనివాస్, రూ.3వేల ఆర్థిక సహాయాన్ని వెంకటేష్‌లు అందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అంబేద్కర్, కిరణ్, వెంకటేష్, ప్రవీణ్, రమేష్, మల్లేష్, సుధీర్‌కుమార్, దుబ్బ లక్ష్మయ్య, రామార్జున్, అంబేద్కర్, రాజు, శివతోపాటు తదితరులు ఉన్నారు.

## కృష్ణయ్యగౌడ్ మృతికి నాయకుల నివాళ్ళు..

### సంతాప సూచికంగా మెడికల్‌షాపులు బంద్

**దేవరకద్ర,జూలై 27 ప్రభాతవార్త:**దేవరకద్రలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో సీనియర్ మెడికల్‌షాపు యజమాని కృష్ణయ్యగౌడ్ మృతి చెందారు.దేవరకద్ర మండలం హాజిలాపూర్‌కు చెందిన కృష్ణయ్య గౌడ్ స్థానిక పాతబస్టాండు వద్ద ఎన్నో ఏళ్ళ నుండి శ్రీరామమెడికల షాపు నడుపుతున్నారు.ఎంతో మందికి కృష్ణయ్యగౌడ్ సుపరిచితులు. అయితే కృష్ణయ్యగౌడ్ అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది.వైధ్యుడ్ని చూయించేలోపు ఆయన మృతిచెందారు.మృతుడికి 5గురు ఆడపిల్లలు ఉన్నారు.కృష్ణయ్యగౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకొన్న చాలా మంది ఆయా పార్టీలకు చెందిన నాయకులు,ప్రజలు,స్నేహితులు హాజిలాపూర్ గ్రామానికి వెళ్ళి నివాళులు అర్పించారు.ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.అందరితో కలిసిమెలసి ఉండే కృష్ణయ్యగౌడ్ మృతి చెందడంతో హాజిలాపూర్‌లో విషాదఛాయలు అలుముకొన్నాయి.

**సంతాప సూచికంగా మెడికల్‌షాపులు బంద్..**

దేవరకద్రలోని సీనియర్ శ్రీరామమెడికల్‌షాపు యజమాని కృష్ణయ్యగౌడ్ మృతికి సంతాప సూచికంగా గురువారం స్థానిక మెడికల్‌షాపులను మూసి ఉంచారు.మెడికల్ రిటేల్‌షాపుల అసోసియేషన్ అధ్వర్యంలో ఆయా షాపుల యజమానులు హాజిలాపూర్ గ్రామానికి వెళ్ళి కృష్ణయ్య గౌడ్ పార్థీవదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శ



**వెల్దండ,జూలై27 ప్రభాతవార్త:**మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి మణెమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్ పరామర్శించారు. సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మ రూ.5వేల ఆర్థిక సహయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సైదయ్య, వార్డు సభ్యులు యాదయ్య, వెంకటయ్య, శేఖర్, మార్కండేయ, కృష్ణ, తానేష్‌యాదవ్, సత్యనారాయణ, తిరుపతయ్య, యాదగిరి, ఆంజనేయులుగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు దూడ మృతి

**జల్లాఘణపురం,జూలై27,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు విద్యుత్ అధికారులు చేస్తుండగా అదే కాలానికి చెందిన కాగితాల పెద్దబాలయ్య ఆవు దూడకు అటుగా వెళ్లి న్యూటల్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు ఆవుదూడ ఖరీదు రూ.20వేలు వరకు ఉండవచ్చు అని దూడ యజమాని బాలయ్య వాపోయారు. ప్రభుత్వంచే ఆదుకోవాలని కోరారు. పాడి రైతు కాగితాల బాలయ్యకు ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పదో వార్డులో పర్యటించిన చైర్మన్



పదో వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కమిషనర్, మేనేజర్

**భూత్పూర్, జులై 27 ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో ఇటీవల వారం, పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ గురువారం తన సొంత పదో వార్డులో తనశాఖ అధికారులు కమిషనర్ నూరుల్ నజీబ్, మేనేజర్ అశోక్‌రెడ్డి కలిసి విస్తృతంగా పర్యటించి పాత ఇళ్లను పరిశీలించారు. పదోవార్డులో పాతఇళ్లు, రేకుల షెడ్‌లలో నివసిస్తున్న వారిని కలిసి వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఛైర్మన్ వెంట బిఆర్ఎస్ నాయకులు సత్తూరు అశోక్‌గౌడ్, మొహ్మద్ అహ్మద్, బజార్ పరశురాం ఉన్నారు.

## నేరుగా లబ్ధిదారుని ఇంటికి సీఎం సహాయనిధి చెక్కు

**లక్ష రూపాయల సిఎం సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే అబ్రహాం**



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

**ఉండవల్లి, జులై 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల మోహన్‌రెడ్డికి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన లక్ష రూపాయల చెక్కును గురువారం ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాం అందజేశారు. నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు ఒక్క గొప్ప వరమని అనేకమంది పేద ప్రజలు డబ్బులు లేక ఆసుపత్రుల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి సహాయనిధి కిందపేద ప్రజల ప్రాణాలను రక్షిస్తుంది. అలంపూర్‌నియోజకవర్గంలో ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘంఅధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి, నరసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్వరాలలో ఇంటింటికి మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్

**వీపనగండ్ల, జూలై27, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా వీపనగండ్ల మండల ఎంపీడీవో కథాలప్ప గ్రామ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఇంటింటికి పంపిణీ చేసిన మొక్కలనను జాగ్రత్తగా పెంచుకోవాలని, ప్రతి రోజు నీరు పోయాలని, ప్రతి ఒక్కరుబాధ్యతగా మొక్కలను పెంచాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శి కురుమన్న ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఉప సర్పంచ్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రైవేటు ట్రాక్టర్ షోరూం సమీపంలో అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. మృతదేహన్ని స్థానికులు గుర్తించి ఎస్ఐ మహేందర్‌కు సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి ఎస్ఐ చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రిలో తరలించారు. మృతి చెందిన వ్యక్తి అన్నసాగర్ గ్రామానికి చెందిన యాదయ్య (35)గా గుర్తించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## చెరువులు, కుంటల్లో చేపల్ని కాపాడుకోండి

**జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు మానెమోని సూచన**



**భూత్పూర్, జులై 27 ప్రభాతవార్త:** జిల్లాలోని మత్స్యకారులు వర్షాలతో అప్ర మత్తంగా ఉండాలని, తమ తమ చెరువులు, కుంటల్లో మత్స్య సంపదను కాపాడుకోవాలని జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు మానెమోని సత్యనారాయణ సూచించారు. జిల్లాలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాల వల్ల చెరువులు, కుంటల్లో చేపలు అలుగుల ద్వారా కిందకు వెళ్లకుండా పెద్ద కళ్లవలలు వేసి చేపల్ని కాపాడుకోవాలని, మత్స్యకారులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ప్లాస్టిక్ కవర్లు అందజేసిన జడ్పీటీసీ



**అడ్డాకుల, జూలై27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కందూరు గ్రామంలో గత వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు పెంకుటిల్లు, మట్టి మిద్దెలలో నివసించే వారికి జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి సొంత డబ్బులతో మట్టి మిద్దెలపై, పెంకుటింట్లపై కప్పుకునేందుకు ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, రామలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో



తూముకుంటలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

**వీపనగండ్ల, జూలై27, ప్రభాతవార్త:** గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వానలకు తూము కుంట గ్రామంలో గడ్డం జయమ్మ ఇల్లు కూలి పోవడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వెంటనే కూలి పోయిన ఇల్లును పరిశీలించడం జరిగింది. గ్రామంలో పాత మట్టి మిద్దెలలో నివసించే వారు ఎవరైనా వెంటనే గ్రామ పంచాయతీ దగ్గర నివాసం ఉండాలని, లేదా వేరే దగ్గర నివాసం ఉండొచ్చని తెలిపారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# ప్రభుత్వ పథకాలే చేరికలకు మూలం

**-ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

**ఊర్కొండ, జులై 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్ర అభివృద్ధి పనులను చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పర్చుకునేందుకు కారెక్కుతున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఊర్కొండ మండలం బొమ్మరాశిపల్లి గ్రామానికి కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు కృష్ణయ్యగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, పాపయ్యగౌడ్, సురేందర్‌గౌడ్, జై దేవ్‌గౌడ్, ఆంజనేయులు, కృష్ణయ్యగౌడ్‌తో పాటు మరో 40 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేస్తుందని, పేదలను అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి కులాల వారిగా అభివృద్ధి పరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక నిధులను ఏర్పాటు చేసి ఆప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తాండలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులఅభివృద్దే లక్ష్యంగానిధులను మంజూరు చేయడం విశేషమన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోనే కాదు... భారతదేశంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మేమందరం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గిరినాయక్, మండల బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, శేఖర్, విజయ్‌యాదవ్, తిరుపతి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

## కారెక్కుతున్న కాంగ్రెస్ నాయకులు

**మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ విధానాన్ని నిరసిస్తూ నిరంతరంగా బిఆర్ఎస్‌లోకి వలసలు**

**ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన 200ల మందికి పైగా చిన్న అదిరాల, బొమ్మరాసిపల్లి గ్రామస్తులు**



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 27 ప్రభాతవార్త:** మూడు గంటల కరెంటు చాలు అన్న కాంగ్రెస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ జడ్చర్ల నియోజకవర్గంలోని చిన్న అదిరాల, బొమ్మరాసిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200ల మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు, కుల సంఘాలు నాయకులుఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో పార్టీలో చేరారు. ఎల్లప్పుడు రైతుల సంక్షేమం కొరకు పాటుపడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిరంతరాయంగా పార్టీలో చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ తాము 70 ఏళ్లుగా కరెంటు కష్టాలు అనుభవించామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలోనూ ఏడు గంటలు ఇస్తామని మూడు గంటలు కరెంటు ఇచ్చేవారని అదికూడా సక్రమంగా సరఫరా వచ్చేదికాదన్నారు. తిరిగి కరెంటు కష్టాలను చూడలేమని నిరంతరంగా రైతులకు కరెంటు అందిస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. రైతులను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్న పార్టీ బిఆర్ఎస్ అని, తామంతా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య, నాయకులు ఇమ్ము, సాయిరాం పాల్గొన్నారు.

# నూతన కోర్టు భవన సముదాయానికి చర్యలు చేపట్టాలి

**-జిల్లా కోర్టు భవన సముదాయాన్ని పరిశీలించిన జిల్లా జడ్జీ రమేష్‌బాబు**



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

**కల్వకుర్తి, జూలై 27 ప్రభాతవార్త:** వర్షాకాలంలో అన్ని గదులకు నీరు చేరి కోర్టు విధులకు ఆదేశం కలుగుతుండటంతో తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదుల బృందం గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. శిథిలావస్థకు చేరిన కోర్టు భవనం న్యాయ మూర్తులు, న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యగా ఆర్అండ్‌బీ అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన భవన నిర్మాణానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీఇచ్చారు. న్యాయవాదులు గతంలో జిల్లా జడ్జీకి ఇదే విషయమై మెమోరాండం సమర్పించడంతో గురువారం జిల్లా జడ్జీ రమేష్ బాబు కోర్టు భవనాలను పరిశీలించి తక్షణ చర్యపై హైకోర్టుకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. న్యాయ వాదులతో సమావేశం నిర్వహించి పరిస్థితి తీవ్రతను ఉన్నతాధికారులకు తెలియపర్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.భాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వి.వెంకట్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, జానకిరాంయాదవ్, యాదిలాల్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



కోర్టు భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జీ రమేష్‌బాబు

## ఇళ్ల మధ్యలో ప్రవేశించిన వరద నీరు

**- దగ్గరుండి చర్యలు చేపట్టిన మున్సిపల్ వైస్ ఛైర్మన్, మున్సిపల్ సిబ్బంది**



ఇళ్ల మధ్యలో చేరిన వరద నీటిని మురుగు కాలువలోకి మళ్లించేందుకు చర్యలు చేపడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్, జూలై27, ప్రభాతవార్త:** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండాకురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన సాయినగర్‌కాలనీ, వెంగళ్‌రావుకాలనీ, జంగిడిపురం కాలనీలలో పీర్లగుట్ట నుండి వచ్చే వరద నీటితో ఇండ్ల మధ్యలో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, మున్సిపల్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వరద నీటిని ఇండ్ల మధ్యలో చేరిన వరద నీటిని జేసీబీ సహాయంతో మురుగు కాలువల్లోకి మళ్లించారు. రానున్న కాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే వరద కాలువల నిర్మాణం దీనికి పరిష్కారమని అన్నారు. ఈ సమస్యను మంత్రి నిరంజన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంగిడిపురంఅసోసియేషన్ అధ్యక్షులు కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## కూలిపోతున్న పాత ఇళ్లు

**అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్న ప్రజలు**



వర్షాలకు కూలిన పాత ఇల్లు

**కృష్ణ, జులై 27 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని కృష్ణ మండలంలో గతకొన్ని రోజులుగా కురుస్తున్న భార వర్షాలకు గురువారం ఖాన్‌దొడ్డి గ్రామంలో నాలుగు గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా గుడెబల్లూరు గ్రామంలో ఒక గృహం పాక్షికంగా కూలిపోవడం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కూలిపోయిన వారి గృహాల వివరాలు ఇలా ఉన్నాయి. గుడెబల్లూరు గ్రామానికి చెందిన తిమ్మప్ప, బుగ్గప్ప అదేవిధంగా ఖాన్‌దొడ్డి బైకాటి తాయప్ప, బాబు నరసప్ప, కమలమ్మల గృహాలు దెబ్బతిన్నట్లు వీరందరిని ప్రభుత్వం వెంటనే ఆదుకునేటట్లు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం



అదృశ్యమైన యువకుడు (ఫైల్)

**ఉండవల్లి, జులై 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన గొల్ల రాముడికి ఇద్దరు కుమారులు గొల్ల నాగరాజు, గొల్ల సత్యనారాయణ, పెద్ద కుమారుడైన గొల్లనాగరాజుకు మతిస్థిమితం లేనందు ఈనెల 18న సాయంత్రం బయటికి వెళ్లి వస్తానని తల్లి లక్ష్మిదేవికి చెప్పి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు తమ్ముడు అయిన సత్యనారాయణ బంధువులు చుట్టుపక్కల వెతికినా ఎక్కడ కనిపించక పోవడంతో గురువారం ఉదయం ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీపీ



సోమేశ్వరమ్మ, ఎంపీపీ

**చిన్నంబావి, జూలై27, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు చిన్నంబావి మండల ఎంపీపీ సోమేశ్వరమ్మ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గత నాలుగు, ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని శిథిలావస్థకు చేరుకున్న ఇంటిలో నివసి ంచరాదని, గ్రామాలలో రోడ్లపై ఉన్న విద్యుత్ స్థంభాలను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలను వర్షంలో తడవకుండా తల్లి దండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాల డ్యామ్ నుండి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలైన గడ్డబస్వాపురం, బెక్కెం, గూడెం, పెద్దమారూర్, వెల్టూరు, చిన్నమారూర్, కాలూర్, చెల్లెపాడు, గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఏదైతే లోతట్టు ప్రాంతాలు ఉన్నాయో ఆయా ప్రాంతాలలో అధికారులు నిరంతరం సమీక్షలు చేయాలని తెలిపారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రుక్మానందరెడ్డి ఎంపిక



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా రుక్మానందరెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**ఇటిక్యాల, జులై 27 ప్రభాతవార్త:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా శనగపల్లి గ్రామానికి చెందిన రుక్మానందరెడ్డిని నియమిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయనకు ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఇటిక్యాల మండలంలో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసంచర్యలు తీసుకోవాలని మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రుక్మానందరెడ్డికి వారు సూచించారు.

## బిసి బంధు అమలులో అవకతవకలు జరిగితే సహించేది లేదు

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. తిరుపతి**



**బాలానగర్, జులై 27 ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బిసి బంధు పేరుతో బిసి కులాలకు రూ. 1 లక్ష ఆర్థిక సహాయం పథకంలో అవకతవకలు జరిగితే సహించేది లేదని బాలానగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. తిరుపతి హెచ్చరించారు. గురువారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బిసి బంధు పేదలకు సరిగ్గా అందడం లేదని, బాలానగర్ మండలంలో వెయ్యి మందికి పైగా ఆర్జిదారులు లోన్ కొరకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 140 మందికి మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అది కూడా టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న ప్రతి బిసి సోదరులకు రూ. లక్ష ఇవ్వాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆర్జిదారులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## వర్షాకాలంలో గర్భిణీలకు ఇబ్బంది ఉండకుండా చూడండి



ముత్యాలంపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న డిఎంఅండ్ఓ డా. కృష్ణ ఇతర వైద్య అధికారులు

**భూత్పూర్, జులై 27 ప్రభాతవార్త:** ఇటీవల కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా మారుమూల ప్రాంతాల్లో గర్భిణీలు ఇబ్బంది పడకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. కృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన భూత్పూర్ వైద్య సిబ్బంది, అధికారులతో కలిసి భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల ప్రాంతమైన ముత్యాలంపల్లిని సందర్శించారు. ముత్యాలంపల్లి బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. గతంలో బ్రిడ్జి లేనందున వైద్య సదుపాయాల కోసం గ్రామస్తులు ముఖ్యంగా గర్భిణీలు పలు అవస్థలు పడినట్లు అధికారులు జిల్లా అధికారి దృష్టికి తేగా జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డా. మొహ్మద్ అబ్దుల్ రబ్, సిహెచ్ఓ బొర్రా రామయ్య, హెల్త్ సూపర్‌వైజర్స్ యాదమ్మ, సుధాకర్, హెల్త్ అసిస్టెంట్స్ ప్రమోద్‌కుమార్, మేక శ్రీనివాస్, ఆశవర్కర్లుపుష్పలత, మంజుల, రజియాబేగం పాల్గొన్నారు.

## పీఎంఎస్‌సి పథకంపై బిజెపి అవగాహన



భూత్పూర్ పీఎంఎస్ కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న బిజెపి నాయకులు

**భూత్పూర్, జులై 27 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి దేశంలోని రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సమృద్ధి పథకం పట్ల భూత్పూర్‌లోని పీఎంఎస్ కేంద్రంలో గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గంగాపురం రవిందర్, సత్తూర్ సత్తయ్యగౌడ్, నరెందర్‌గౌడ్, లిక్కిహరినాథ్‌గౌడ్, రాంరెడ్డి, మల్లికార్జున్, రాముతో పాటు ఇతర రైతులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోవులకు పండ్లు పంపిణీ



**మక్తల్, జులై 27 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పసుపుల వద్ద ఉన్న అనాకులం గోకులం గోశాలలో నేడు లయన్ శరణప్ప కుమారుడు అంబ్రేష్ జన్మదినం సందర్భంగా గోవులకు పండ్లు, గోరక్షులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ అంబదాస్‌రావు అధ్యక్షతన నిర్వహించబడింది. గోవులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తదనంతరం సుమారు వందకుపైగా గోవులకు పండ్లు అందజేశారు. అదేవిధంగా గోవులను సంరక్షిస్తున్న మూడు జంటలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు, గోశాల నిర్వాహకులు రఘుప్రసన్నభట్, జాయింట్ సెక్రెటరీ మామిళ్ల పృథ్విరాజ్, రవికుమార్‌గౌడ్, శరణప్ప, వారి కుటుంబ సభ్యులు పారిజాత, గీత, అజయ, పూజ, అక్షిత, విజయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ



**ఉండవెల్లి, జులై 27 ప్రభాతవార్త:** అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాంని జిల్లాకు నూతనంగా వచ్చిన ఆర్డీఓ చంద్రకళ కలుసుకున్నారు. కలిసి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ వీరభద్రప్ప పాల్గొన్నారు.

## వర్షానికి కూలిపోయిన మట్టి ఇండ్లు



**ఊట్కూర్, జులై 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కుమ్మరివాడకు చెందిన శ్రీను ఇల్లు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇల్లు మొత్తం పడిపోయిందని ఉండడానికి లేని పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం దయ ఉంచి సాయం అందించాలని తెలియజేశారు. అలాగే చిన్నపొర్ల గ్రామంలో మట్టి ఇల్లు కూలిపోతున్నాయి. గురువారం ఎస్ఎం అన్వర్‌కు చెందిన మట్టిఇల్లు గోడ తెల్లవారుజామున కూలిపోయింది. వర్షం ఇలాగే కురిస్తే ఇల్లు పూర్తిగా కూలిపోయే అవకాశం లేకపోలేదని కుటుంబ సభ్య లు పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మాదిగ విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

**- ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ**



**వనపర్తి టౌన్, జూలై27, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మాదిగ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు కొమ్ము చెన్నకేశవులు మహాజన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ మాట్లాడుతూ... ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ విద్యార్థులతో సమావేశాలు ఏర్పాటు చేసి మాదిగ విశ్వరూప మహాసభకు షెడ్యూల్ కులాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కో కన్వీనర్ మొలకలపల్లి పరుశురాముడు, ఎంఎస్ఎఫ్ నాయకులు శివ మాదిగ, అభిషేక్ మాదిగ, విజయ్ మాదిగ, మహేష్‌మాదిగ, గణేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మహాజన పొలిటికల్ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

**వనపర్తి టౌన్, జూలై27, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో గురువారం మహాజన పొలిటికల్ జేఏసీ జిల్లా నూతన హడక్ కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా రవిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, ఉపాధ్యక్షులు ఎడవల్లి భాస్కర్, కొమ్ము సామెల్, గొర్ల బాబురావు, కార్యదర్శులుగా చింతకుంట కురుమూర్తి, డీలర్ రాములు, సోషల్ మీడియా జిల్లా ఇంచార్జ్ చింతకుంట బీసన్నలను ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు.

## పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన జోగులాంబ జోన్ డిఐజి




గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఐజి, డిఐజికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ

**గద్వాల ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త:** వార్షిక తనిఖీల్లో భాగంగా జోగు లాంబ జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్ ఐపిఎస్ కోదండపూర్, మనోపాడు పోలీస్ స్టేషన్‌లను, గద్వాల, శాంతినగర్ సర్కిల్ కార్యాలయాలను డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంను సందర్శించి రికార్డులను, పరిస రాలను, పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేశారు. అందులో భాగంగా కోదడాపూర్ పోలీస్ స్టేషన్ దగ్గర గౌరవ వందనం స్వీక రించి సిబ్బంది ప్రాపర్ యూనిఫామ్, మెయింటెనెన్స్‌ను పరిశీలించారు. కోదం డాపూర్, మానోపాడు పోలీస్ స్టేషన్‌ల ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్‌టీమ్, ఎస్‌హెచ్ఓ, మెన్ రెస్ట్‌రూమ్, లాకప్ రూం తదితర ప్రదేశాలను పరిశీలించారు. స్టేషన్‌లో రోజు వారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రి రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీబుక్స్, సస్పెక్ట్ చెక్‌రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్, విజిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్టులు తదితర రికార్డులను తనిఖీ చేశారు. తరువాత శాంతి నగర్, గద్వాల సర్కిల్‌కార్యాలయాలను సందర్శించి తనిఖీ చేశారు. శాంతినగర్ సర్కిల్ కార్యాలయ తనిఖీ అనంతరం జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు, సాయుధ దళ డీఎస్పీ ఇమ్మానియేల్, కార్యాలయ ఏఓ సతీష్, శాంతినగర్ సిఐశివశంకర్, గద్వాల సిఐ శ్రీనివాస్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శివ కుమార్, సిసి ఎస్ ఇన్స్‌పెక్టర్ రామ స్వామి, కోదండాపూర్ ఎస్సై కృష్ణ, మానోపాడ్ ఎస్సై రాముకొండూరు, సిసి అశోక్‌గౌడ్, గద్వాల సర్కిల్ ఎస్సైలు ఆనంద్, వెంకటేష్, శ్రీకాంత్, నందికర్, కళ్యాణ్‌కుమార్, శివానందగౌడ్, జిల్లాపోలీస్‌కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయి అధికారులతో కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్




విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

**గద్వాల ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త:** భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవా ల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికా రులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గురువారం భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు ఉన్నందున జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరు స్థాని కంగా ఉండాలి, ముంపు ప్రాంతాలలో పర్యటించాలని, ప్రజల మధ్య ఉండా లని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితి ఉన్నట్లయితే వాటిని గుర్తిం చి నివాసితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తలించాలని అన్నారు. మండలాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలనుసురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు అత్యవసర సమయంలో జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 7993499501కు ఫోన్ చేయాలని సూచించారు. విడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ ఎస్ఈ భాస్కర్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు, రహీముద్దిన్, సీఈఓ ముసాయిదాబేగం, సిపిఓ లక్ష్మణ్, డిపిఓ శ్యాం సుందర్, ఆర్అండ్‌బి ప్రగతి, పిఆర్‌ఈఈ రామాంజనేయులు, ఆర్డీఓ చంద్రకళ తహసిల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లు

**గద్వాల ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త:** పంచాయతీ వర్కర్ల సమ్మెలో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఏఎల్ఓకు వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచెడ్ కార్తీక్ అలాగే పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పి. హరీష్ హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులకు జిఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 10 లక్షల నష్టపరిహారం అందించాలని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేటనుండి జరుగుతున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీలలో 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారని వీరందరు పేద, బలహీన వర్గాలకు చెందిన వారన్నారు. గ్రామాల్లో చెత్త చెదారం మానవుల జంతువుల కుళ్లిపోయిన శవాల తొలగింపు మురికి కాలువలను శుభ్రంచేస్తూనిత్యం మరణాలతో సహజీవనం చేస్తున్న వీరిని ప్రభుత్వం కనీసం మనుషులుగా కూడా చూడడం లేదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కుతో హక్కుల సాధనకై సమ్మె చేస్తున్న కార్మికులకు ప్రజాపథాపార్టీ భుజం భుజం కలుపుతుందని, విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకుడు గంజిపేట అంజి, బీచుపల్లి రాఘవేంద్ర, పెద్ద గోవిందు, నాగరాజు, బజారమ్మ, తాయమ్మ, సుజాత, పరశురాము, మహేష్, యశోద, వెంకటేశ్మరమ్మ, పద్మ, శారద, మధు, తిమ్మప్ప, మద్దిలేటి, శాంతిరాజు, కళ్యాణ్, ప్రకాశం, శ్రీనివాసులు, దుబ్బన్న, తిమ్మప్ప, రత్నమయ్య పాల్గొన్నారు.

## పెద్దజట్రం నర్సింహ మరణం తీరనిలోటు

**ఉట్కూర్, జులై 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దజట్రం గ్రామంలోని నరసింహ మరణం తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందిం చేందుకు జిఓ నం 69 అమలు చేసి నారాయణపేట, కొడంగల్ ఎత్తి పోతల పథకం చేపట్టాలని బిజ్వార్ నుండి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ వరకు పాదయాత్ర చేసిన పెద్దజట్రం నర్సింహ మరణం రైతులకు తీరనిలోటని జిల్లాసాధన సమితి కో కన్వీనర్ హెచ్. నర్సింహ తెలి పారు. సాగునీటి కోసం చేపట్టిన ఉద్యమాలలో వారి పాత్ర వెల్లకట్టలే నిదని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థి స్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అన్నం పెట్టే రైతును రాజును చేయడమే ప్రధాని లక్ష్యం

- 1,25,000 వన్ స్టాప్ సెంటర్లుగా పని చేసే కిసాన్ సేవా కేంద్రాలు
- తెలంగాణలో 4వేల రైతు సేవా కేంద్రాలు ప్రారంభం
- తెలంగాణలో 39 లక్షల మంది లబ్ధిదారులు
- 14 విడతల్లో ఇప్పటిదాకా 2,70,000 కోట్ల నిధులు విడుదల
- మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు

**వనపర్తి టౌన్, జూలై27, ప్రభాతవార్త:** దేశానికి అన్నం పెట్టే రైతును రాజును చేయడమే ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యం అని మాజీ ఎమ్మెల్సీ రామ చంద్రారావు అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ 1, 25,000 కిసాన్ సమృద్ధి సేవా కేంద్రాలను ప్రారంభించే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.ఏ.రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పాత మార్కెట్ యార్డు మన గ్రోమోర్ రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, సుప్రీంకోర్టు న్యాయవాది రామ చంద్ర రావు మాట్లాడుతూ.... ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రధానమంత్రి కిసాన్ సేవా కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయినా 1,25,000 ఎరువుల రిటైల్ షాపులను ప్రారంభించారని, మన రాష్ట్రంలో 4వేల రైతు సేవా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, భూసార పరీక్షలు, విత్తన పరీక్షలు, వ్యవసాయ పరికరాల లభ్యత, నూతన వ్యవసాయ పద్ధతుల మీద అవగాహన, మందుల పిచికారికి అవసరమయ్యే డ్రోన్లను అందుబాటులో ఉంచడం, ఆధునిక వ్యవసాయంపై అవగాహన, పంటలను అవసరమయ్యే సహకారం, విత్తనాల లభ్యత , నాణ్యత సేవలు, రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా రైతులకు వాట్సాప్ గ్రూపులో వాతావరణ సమాచారం, రోజు వారి పంట ధరల వివరాలు ప్రతి నెల రెండవ ఆదివారం రైతుల సమస్యలపై సమావేశం, సేవా కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి వ్యవసాయంపై శిక్షణను ఎరువుల శాఖ ఇవ్వనుందని ఇకనుంచి అన్ని రకాల ఎరువుల భారత్ బ్రాండ్ పేరుతో రానున్నాయని ఇలా అన్ని రకాల సేవలను ఈ వన్ స్టాఫ్ సెంటర్లలో కేంద్ర ప్రభుత్వం అందించనుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 14వ విడత దేశంలోని 8.5 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 17వేల కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా 39 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నారని ఇప్పటి దాకా కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఖాతాల్లోకి 2,70,000 వేల కోట్లు జమ చేయడం జరిగిందని, నాలుగు లక్షల కోట్ల ఎరువుల సబ్సిడీ, యాంత్రీకరణ సబ్సిడీ మీద లక్షల కోట్లు , కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా నేరుగా రుణాలతో దేశానికి అన్నం పెట్టే రైతును రాజు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, బి.కృష్ణ , జింకల కృష్ణయ్య, జిల్లా పదాధికారులు మాధవరెడ్డి, రామన్ గౌడ్, కేతూరి బుడ్డన్న, సుమిత్రమ్మ, కుమార స్వామి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాములు, బాసెట్టి శ్రీను, విజయ భాస్కర్ , పెద్దిరాజు, చిత్తారి ప్రభాకర్, పరశురాం, పద్మ, బచ్చు రాము , రాయన్న సాగర్, మండల అధ్యక్షులు, సర్పంచ్ దేవేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, కృష్ణ గౌడ్, ఐటీ సెల్ విజయ్ సాగర్, చుక్క సతీష్ , వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రమాణాలు పెంచండి

### ●మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 27 ప్రభాతవార్త:** విద్యార్థుల విద్యాస్థాయి ప్రమాణాలను పెంచాలని, అందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులు, హెచ్ఎంలు కృషి చేయాలని డీఈఓ రవిందర్ ఆదేశించారు. మహబూబ్‌నగర్‌లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత విద్యా సంవత్సరం ప్రారంభించబడిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులలో బోధనా అభ్యసన సామర్థ్యాలు పెరిగి తరగతుల వారిగా విద్యార్థుల స్థాయి పెరిగిందన్నారు. దీనికి కొనసాగింపుగా ఈ సంవత్సరం ఎఫ్ఎల్ఎన్ 2 నిర్వహించబోతున్నామని అందులో భాగంగానే శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు ఇక్కడ శిక్షణ పొందిన విషయాలను పాఠశాల స్థాయిలో అమలు పరిచి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి వెళ్లకముందు తరగతిలో బోధించాల్సిన విషయాలను సన్నద్ధం చేసుకుని చక్కటి ప్రణాళికతో వెళ్లాలన్నారు. విద్యార్థుల వైయుక్తిక బేధాలకు అనుగుణంగా బోధనా వ్యూహాలను సిద్ధపరచుకోవాలని తద్వారా విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేయాలన్నారు. తరగతి గదిలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని చెప్పారు. ప్రతి పాఠశాలలో బ్యాంకు నిర్వహించవలెనని విద్యార్థుల ఆర్థిక సామాజిక పరిస్థితులు ప్రతి ఉపాధ్యాయునికి తెలిసుండాలన్నారు. ప్రతి పాఠశాలలో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ పెంచాలని, ముఖ్యంగా కరివేపాకు, నిమ్మ, మునగచెట్లను పెంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయ అధికారులు బాలు యాదవ్ బైకాని, దూకుడు శ్రీనివాస్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి ఎంఎ మన్నన్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ రబ్, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

## విధుల పట్ల అంకితభావంతో పని చేయాలి

### ●వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ●మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

**వనపర్తి టౌన్, జూలై27, ప్రభాతవార్త:** విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వనపర్తి జిల్లా పరిధిలోని మదనాపురం మండల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను మదనాపురం ఎస్ఐ మురళిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో రోజు వారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. రిసెప్షన్ కౌంటర్‌ను సందర్శించి ఫిర్యాదు స్వీకరించిన అనంతరం నమోదు చేసిన రిసెప్షన్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని చెరువులు, వాగులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముసురు వర్షాల వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు. మదనాపూర్ మండలంలో అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మార్గంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలు నివారించడానికి కృషి చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పరచాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమాచారమైన డయల్ 100 ద్వారా తెలపవచ్చు అని ఆమె సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాల్లో పట్టణాల్లో ప్రజలకు ప్రజాప్రతినిధులకు యువకులకు గ్రామాల వీపీవోలు, పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ సీఐ రత్నం, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 27 ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ కోరారు. గురువారం ఆయన భారీ వర్షాలపై జిల్లా, మండల స్థాయిఅధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప వర్షంలో ప్రజలు బయటికి రావద్దని, ముఖ్యంగా గ్రామాలలోని రైతులు, కూలీలు పొలం పనుల నిమిత్తం వాగులు, వంకలు దాటే సాహసం చేయవద్దని కోరారు. కాజ్‌వేలు, రహదారులు పొంగి ప్రవహించే చోట తక్షణమే వాటిని మూసివేయాలని, అంతేకాక సిబ్బందిని అక్కడ రక్షణగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్నచోట ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. వర్షానికి కూలిపోయేందుకు, పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న పాత ఇండ్లను గుర్తించి అక్కడ నివాసం ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి పునరావాసం ఏర్పాటు చేయాలని అన్నారు. అత్యవసర సాయం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని ఏమైనా సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 08542, 241165కి కాల్ చేయాలని కోరారు. వర్షాల పట్ల ప్రజలకుఅండగా ఉండేలా మండల, గ్రామస్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించాలని, వర్షాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఫీల్డ్ సిబ్బంది మొత్తం గ్రామాలలో పర్యటించి ప్రజలకు సహాయంగా ఉండాలన్నారు. మత్స్య కారులుచేపలుపట్టేందుకువాగులు, వంకలు, నదులలోకి వెళ్లవద్దని, రాష్ట్రప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించి నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలను ఎవరు తెరవవద్దని ఆదేశించారు. పిల్లలునీటి ప్రవాహాల వద్దకు ఎట్టి పరిస్థితులలో వెళ్లవద్దని, తల్లిదండ్రులు పిల్లలను వర్షంలో బయటికి పంపవద్దని కోరారు. నీరు ప్రవహించే చోట, జలపాతాలు, కోయిల్‌సాగర్‌వంటి పర్యాటక ప్రదేశాలను తక్షణమే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌కు రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు హాజరయ్యారు.

## పెద్దొడ్డి సర్పంచ్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

**మల్దకల్, జులై 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామ సర్పంచ్ సునితను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం సస్పెండ్ చేసినట్లు డిపిఓ చేసినట్లు శ్యాంసుందర్ తెలిపారు. ఉపాధి పథకం కింద చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## ఎస్‌విసి మల్టీప్లెక్స్ సినిమా థియేటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, బేబి సినిమా యూనిట్



సినిమా థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి,

**గద్వాల ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎస్‌విసి సినిమాథియేటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నిర్మాత అధినేత దిల్‌రాజు, మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, బేబి సినిమా యూనిట్ హీరో, హీరోయిన్, డైరెక్టర్‌లు హాజరయ్యారు. ఎమ్మెల్యే, ఛైర్మన్, బేబి సినిమా యూనిట్ సభ్యులు రిబ్బన్ కట్ చేసి థియేటర్‌ను ప్రారంభించారు. సరదాగా కాసేపు ఎస్‌విసి మల్టీప్లెక్స్ అధినే, ప్రముఖ నిర్మాత దిల్‌రాజుతో కలిసి ఎమ్మెల్యే సినిమా చూశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి సినిమా థియేటర్‌ను మొట్ట మొదటగా పరిచయం చేసిన వ్యక్తులు భాస్కర్‌రెడ్డి ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ పరిస్థితులకు రూపొందించుకుని అన్ని హంగులతో ఎస్‌విసిథియేటర్‌ను నిర్మాత దిల్‌రాజు చాలా తక్కువ సమయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గద్వాల అభివృద్ధిలో భాగంగా మల్టీప్లెక్స్ థియేటర్ రావడం కూడా చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లాఅధ్యక్షులు చిరు ముదిరాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, గద్వాల టౌన్‌పార్టీ అధ్యక్షుడు గోవిందు, బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు ప్రభాకర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, కురుమన్న, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సినిమా చూస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, బేబి సినిమా యూనిట్

## జిల్లాలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

### సమైక్యంగా పనిచేసి పార్టీని గెలిపిద్దాం: ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



**గద్వాల ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. ఎస్ఎ సంపత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా విస్తృతస్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ విజయ పథంలో నడిపించడానికి అన్ని కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశానన్నారు. రేపటి నుంచి ప్రజల్లోకి వెళ్లి టిఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టి కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించానన్నారు. సోషల్ మీడియా ప్రతిష్టత, కార్యకర్తల సమన్వయం, ప్రోటోకాల్, క్రమశిక్షణ, చేరికల అంశాలు, జరగబోయే కొల్లాపూర్ పాలమూరు గర్జన సభ అంశాలను ఉద్దేశించి నాయకులకు తగిన సూచనలు చేశారు. దేశంలో అనేక అరాచకాలకు అడ్డాగా మారిన బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమాన్ని మంట కలిపిన రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు కంకణబద్ధులై ఉన్నారని కావున ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించి కాంగ్రెస్ పార్టీకి సైనికుడిలా పనిచేసి అటు కేంద్రంలో ఇటు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా నాయకులంతా కలిసికట్టుగా పని చేస్తామని అన్నారు. నాయకుల మధ్య ఉన్న విభేదాలను పక్కకు పెట్టి సమన్వయంతో బలోపేతానికి కృషి చేసి క్రమశిక్షణతో మెలిగి, సోషల్ మీడియా నెట్వర్క్‌ను పెంచుకుని, ప్రోటోకాల్ పాటించి, పార్టీ బలోపేతానికి పార్టీ అధికార విజయానికి కృషి చేయాలని ముఖ్య నాయకులకు సూచించానన్నారు. 30న జరగాల్సిన కొల్లాపూర్ భారీ బహిరంగ సభ కొన్ని అనివార్య కారణాలతో ఆగస్టు 5వ తేదీన వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చేస్తున్నామన్నారు. ఈ సభను ఎన్నడు లేని విధంగా మూడు లక్షల ప్రజలతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి కాంగ్రెస్ విజయ శంఖారావాన్ని ముగిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్‌రెడ్డి, సీనియర్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, జాతీయ యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ రాజవ్‌రెడ్డి, సీనియర్ నాయకులు బక్క చంద్రన్న, తిరుపతయ్య, వీరబాబు, మాజీ వైస్ ఛైర్మన్ గంజిపేట శంకర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్డేపల్లి దేవేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, జిల్లా మహిళా నాయకులు, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టు ఏడుగేట్లు తెరిచిన అధికారులు



జూరాల గేట్లు తెరిచిన దృశ్యం

**ధరూర్, జులై 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి కృష్ణమ్మ పరు గులు పెడుతోంది. భారీ వర్షాలతో 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీంఎంసిలుగా కాగా ప్రస్తుతం 7,971 టీఎంసిల నీరు నిల్వ ఉంది. 7 గేట్ల ద్వారా 27,846 టీఎంసిల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పంపు ద్వారా 750 క్యూసెక్కులు ఎత్తిపో స్తున్నారు. అలాగే భీమా లిఫ్ట్‌వన్ ద్వారా 1300ల క్యూసెక్కుల నీరు ఎడమ కాలువ ద్వారా 390 క్యూసెక్కుల నీటిని పవర్ హౌస్ ద్వారా 42,576 క్యూసెక్కుల నీటిని టోటల్ అవుట్‌లో 72,933 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.